ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం


ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకుంటున్న స్నేహితులు

శంషాబాద్: స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు ఒక్కచోట చేరి కలిసి సంబరంగా గడిపారు. పాఠశాలలో జరిగిన పాత జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ముప్పై ఏళ్ల కిందటి ముచ్చట్లు చెప్పుకుంటూ మురిసిపోయారు, ఉల్లాసంగా ఆడిపాడారు. కార్యక్రమంలో ఎస్. వెంకటేష్‌రెడ్డి, ఎస్.జయప్రకాష్, మహ్మద్ ఆసిఫ్, యూసుఫ్, చందు, సాయిబాబా, కిరణ్, వరలక్ష్మీ, రజిత, భాగ్యలక్ష్మీ, మంజుల, సరిత, డాక్టర్ కృష్ణ, భాస్కర చారి, చందు, కొమరయ్య, ధన్‌రాజ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం అభివృద్ధికి పాటుపడాలి


సమావేశంలో పాల్గొన్న కురుమ సంఘం సభ్యులు

బండ్లగూడ: కురుమ సంఘం అభివృద్ధికి అందరూ పాటుపడాలని కురుమ సంఘం కార్పొరేషన్ అధ్యక్షుడు తాండ్ర రమేష్ కుమార్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సంధ్యానగర్ కాలనీలో ఆదివారం జరిగిన కురుమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి నగరంలో నివసిస్తున్న కురుమ కులస్తుల పూర్తి వివరాలను సేకరించి సంఘం సభ్యులుగా చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నరేష్, మల్లేష్, రమేష్, లక్ష్మణ్, జగదీష్, వితలయ్య, బాబురావు, బాలకృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఖాదీ గ్రామోద్యోగ్ విద్యాలయంలో ఖాదీ వికాస్ యోజన, గ్రామ వికాస్ యోజన కింద 2024–25 సంవత్సరానికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఖాదీ వికాస్ యోజన కింద ఖాదీ స్పిన్నింగ్, నేయడం, అద్దకం, ప్రింటింగ్, గ్రామ వికాస్ యోజన కింద లెదర్, రెక్సిన్ క్రాఫ్ట్, తేనెటీగల పెంపకం, వెదురు కర్రలతో ఆర్టికల్స్ తయారీ, ఫైబర్ ఫ్యాన్సీ ఆర్టికల్స్ తయారీ, క్లీనింగ్ ఏజెంట్లు తయారీ, మూలికా ఉత్పత్తుల తయారీ, పేపర్ బ్యాగ్‌ల తయారీ, బ్యూటీషియన్‌లో అడ్వాన్స్ కోర్సు, ఇస్తరాకులు, కప్పు, ప్లేట్ తయారీ, డిటర్జెంట్ పౌడర్ తయారీ, కంప్యూటర్ల అసెంబ్లింగ్ తయారీ, క్లాత్ బ్యాగ్ తయారీ, టైలరింగ్ అండ్ కటింగ్ అండ్ ఎంబ్రాయిడరీ తయారీ, మొబైల్ రిపేరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను రెక్టార్‌కేజీఎంవీఃజీమెయిల్.కామ్‌లో పంపించాలన్నారు. ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మార్కండేయనగర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా రావుల నవీన్...

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మార్కండేయనగర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా రావుల నవీన్ నియమితులయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడిగా రావుల నవీన్, ఉపాధ్యక్షుడిగా మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా మధు గౌడ్, సహాయ కార్యదర్శిగా సురేశ్, కోశాధికారిగా భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా చింటూ రెడ్డి, రాజు, శశిరాజ్, వెంకటేశ్, విజయ్ యాదవ్, సాయి యాదవ్, శివ, బాలాజీ, కాల రాజు, శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను మార్కండేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ, వీరాంజనేయ స్వామి దేవాలయ అసోసియేషన్ కమిటీ సమన్వయంతో ఘనంగా నిర్వ హిస్తామని రావుల నవీన్ కుమార్ తెలిపారు. అనంతరం ఆయనను నవోదయ యువజన సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు

అత్తాపూర్: రాంభాగ్ దుర్గామాత మందిరంలో అమ్మవారు శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఆషాఢ మాసం చివరిరోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి విశిష్ట పూజలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అంజమ్మ, పుష్ప, నాగమణి, జయమ్మ, కవిత, శివాని, శమంత, శోభ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



పడకేసిన పార్కుల అభివృద్ధి

• పట్టించుకోని అధికారులు • మిన్నకున్న ప్రజాప్రతినిధులు • కాలనీవాసుల అవస్థలు


ప్రహరీకట్టి వదిలేసిన మారుతీనగర్ కాలనీ పార్కు స్థలం

మణికొండ: కాంక్రీట్ జంగిల్‌గా మారిన కాలనీల్లో అరకొరగా ఉన్న పార్కు స్థలాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చేస్తే అవి ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచుతాయి. అలాంటి పార్కులను పట్టించుకోకుండా వదిలేయటంతో కబ్జాలకు గురయ్యే అవకాశం ఉంది. మణికొండ పరిధిలోని కొన్ని పార్కుల అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శంకుస్థాపనలు చేసి నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. గత మున్సిపల్ కమిషనర్ కొన్ని పార్కుల రూపురేఖలు మార్చి ప్రజలకు అందుబాటులోకి తేవటంతో వాటిల్లో వందలాది మంది సేదదీరేందుకు, చిన్నారులకు ఆడుకునేందుకు అవకాశం ఏర్పడింది. మరికొన్ని పార్కులను పట్టించుకునే వారు లేక, పనులను మధ్యలోనే వదిలేయటంతో ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మారుతీనగర్ కాలనీ పార్కు స్థలాన్ని లేఅవుట్ చేసిన వారు తిరిగి అమ్ముకునే ప్రయత్నం చేయడంతో కాలనీవాసులు దశాబ్దం పైగా పోరాటం చేసి దక్కించుకున్నారు. అలాంటి పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దానిని పార్కుగా అభివృద్ధి చేసి ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేపీఆర్ కాలనీలో...

కేపీఆర్ కాలనీలోని చిన్న పార్కును ఆధునీకరించి ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పనులు ప్రారంభించారు. నెలలు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోగా, ఇప్పటి వరకు చేపట్టిన పనులు సైతం పాడైపోతున్నా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలు మార్లు మున్సిపల్ కౌన్సిలర్, చైర్మెన్, కమిషనర్‌లను కలిసినా ప్రయోజనం లేదని వారు వాపోతున్నారు.


పూర్తి కాని కేపీఆర్ కాలనీ పార్కు పనులు

వేంకటేశ్వర కాలనీలో...

మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఐదు చోట్ల పార్కులకు స్థలాలను లేఅవుట్‌లో చూపినా మూడు పార్కు స్థలాలను ఇప్పటికే లేఅవుట్ చేసిన రియల్టర్లు అమ్ముకున్నారు. మిగిలిన రెండు పార్కులనైనా అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలని కాలనీ వాసులు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు ఓ పార్కును అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యేతో ఎనిమిది నెలల క్రితం శంకుస్థాపన చేయించారు. అయినా ఇప్పటి వరకు పనులను పూర్తి చేయకపోవటంతో కాలనీ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కు స్థలంలో పిచ్చి మొక్కలు పెరగటంతో పాములు వస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఇకనైనా మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన మారుతినగర్, కేపీఆర్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ పార్కుల పనులను పూర్తి చేయించాలని ఆయా కాలనీల వాసులు డిమాండ్ చేస్తున్నారు.


ప్రహరీకే పరిమితమైన వెంకటేశ్వరకాలనీ పార్కు

పార్కులకు ప్రాధాన్యం ఇవ్వాలి



మారుతీనగర్ కాలనీ పార్కు స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు విశ్వ ప్రయత్నాలు చేశారు. దాన్ని కాలనీవాసులు అధికారుల సహకారంతో తిప్పికొట్టి దక్కించుకోగలిగాం. 15 ఏళ్ల తర్వాత పార్కు పనులు మొదలు పెట్టినా ప్రహరీ నిర్మించి వదిలేశారు. కాలనీ ప్రజలు సేదతీరేందుకు ఎక్కడా స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పనులకు ప్రాధాన్యం ఇచ్చి వెంటనే పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

– మల్లారెడ్డి, అధ్యక్షుడు, మారుతినగర్ కాలనీ

కమీషన్ పనులకే ప్రాధాన్యం ఇస్తున్నారు



కేపీఆర్ కాలనీలో పార్కు అభివద్ధి పనులను ప్రారంభించి నెలలు గడుస్తున్నా పూర్తి చేయటంలో మున్సిపాలిటీ అధికారులు విఫలం అవుతున్నారు. ఇప్పటికే ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునే వస్తువులను ఏర్పాటు చేసి మిన్నకున్నారు. పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే కాలనీ వాసులకు సౌకర్యంగా ఉంటుంది. ప్రజలకు అవసరమైన పనులను కాకుండా కమీషన్‌లు ఎక్కువగా వచ్చే పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారు.

– రమణారెడ్డి, అధ్యక్షుడు, కేపీఆర్ కాలనీ

పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదు



కాలనీలోని ఐదు పార్కులలో మూడింటిని రియల్టర్లు అమ్ముకున్నారు. మిగిలి ఉన్న రెండు పార్కులను కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. కాలనీ వాసుల పోరాటంతో అవి మిగిలాయి. వాటిని వెంటనే అభివృద్ధి చేసి ప్రజలకు అప్పగించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు మీనవేషాలు లెక్కిస్తున్నారు. ప్రహరీ పనులు చేసి మిగిలిన పనులను పక్కన పెట్టారు. పలు మార్లు పార్కు పనులను పూర్తి చేయమని చెప్పినా పట్టించుకునే నాథుడే లేడు.

– ఉపేంద్రనాథ్‌రెడ్డి, అధ్యక్షుడు, వెంకటేశ్వరకాలనీ

పరిశీలించి పనులు చేయిస్తా



మున్సిపాలిటీ పరిధిలోని మారుతీనగర్, కేపీఆర్‌కాలనీ, వెంకటేశ్వర కాలనీలలోని పార్కుల పరిస్థితిని పరిశీలించి రాబోయే మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానాలు చేయించి మిగిలిన పనులను పూర్తి చేస్తాం. ఇప్పటికే తీర్మానాలు జరిగి ఉంటే వాటిని వెంటనే టిండర్ పిలిచి పూర్తి చేయిస్తాం. మధ్యలో ఉన్న పనులకు ప్రాధాన్యం ఇచ్చి వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. త్వరలోనే చర్యలు తీసుకుని వాటి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

– డి. ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ

నేడు స్వచ్ఛదనం.. పచ్చదనం ర్యాలీ

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశుభ్రత, మొక్కల పెంపకం ఆవశ్యకతలను తెలియజేసేందుకు సోమవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఉదయం 10గంటలకు అలకాపూర్ టౌన్‌షిప్, చింతచెట్టు సర్కిల్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా కావడి ఊరేగింపు



అత్తాపూర్: హైదర్‌గూడలోని అంబియెన్స్ ఫోర్ట్ కాలనీ, అత్తాపూర్ తేజస్వీ నగర్ కాలనీలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాసం ఉన్న భక్తులు కావడిలో గంగాజలాన్ని తీసుకుని హైదర్‌గూడ, అత్తాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం నుంచి చిన్న అనంతగిరి శివాలయానికి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉమామహేశ్వర స్వామికి గంగాజలంతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో నారగూడం మల్లారెడ్డి, హరినాథ్, సాబాద విజయ్ కుమార్, గంగిడి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ చైతన్య విలాస్ కాలనీలోని హనుమాత్ సేవిత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఈ నెల 6 నుంచి 9 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వివరించారు. ఈ సందర్భంగా సందర్భంగా దేవాలయాన్ని అలంకరించారు. 6వ తేదీ నుంచి 9 వరకు ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 9న చిన్న జీయర్ స్వామి ఆహోబిల జీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కష్టపడే వారికి సముచిత స్థానం


కార్తీక్‌రెడ్డిని కలిసిన యువకులు

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీ మారినా కార్యకర్తలు, ప్రజలు తమ వెంటే ఉన్నారని, పార్టీ అభివృద్ధికి కష్టపడే వారికి సముచిత స్థానం కల్పిస్తామని బీఆర్ఎస్ జాతీయ అధికార ప్రతినిధి పి. కార్తీక్‌రెడ్డి అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ సీనియర్ నాయకుడు ఎస్. శ్రీకాంత్ ఆధ్వర్యంలో పలువురు యువకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పార్టీ పటిష్టంగా ఉందని, కేవలం కొందరు రాజకీయ పైరవీకారులు మాత్రమే పార్టీ మారారని, వారి పార్టీని వీడటం మంచి పరిణామన్నారు. నిజమైన కార్యకర్తల నుంచే నాయకులను తయారు చేసి రాబోయే రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామని, ప్రతి వార్డులో పార్టీని పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి పోరాటాలకు సిద్ధంగా కావాలని, ప్రజాక్షేత్రంలోనే ప్రజాప్రతినిధులను ప్రశ్నించే రోజు త్వరలోనే వస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఎల్లస్వామి, మహేష్‌యాదవ్, తిరుపతి, శివముదిరాజ్, హుస్సేన్, చంద్రశేఖర్‌గౌడ్ సతీష్, బాలకృష్ణ, శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారలే!



సాక్షి, సిటీబ్యూరో: స్నేహితుల దినోత్సవం సందర్భంగా 20 ఏళ్ల నాటి స్నేహితులు హైదరాబాద్ లుంబినీ పార్క్‌లో ఆదివారం కలుసుకున్నారు. ఒకప్పుడు ఉత్తరాల ద్వారా పరిచయమైన వీరంతా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందినవారు. పెన్–ఫోన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ద్వారా వీరంతా పలు కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. శరత్, పుల్లారెడ్డి, నాగరాజు, మల్లికార్జున, నాగ వీరేంద్ర, అస్లాం షరీఫ్ జిలానీ, వెంకటేశం, రాజయ్య, వేణు, రాజు, టీవీ ఆర్టిస్ట్ మురళీకృష్ణ, కిశోర్ పాల్గొన్నారు.

అమావాస్య సందర్భంగా అన్నదానం


అలకాపూర్ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో


పుప్పాలగూడ నల్లపోచమ్మ వద్ద అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

మణికొండ: పేదల ఆకలి తీర్చేందుకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పలువురు దాతలు, సేవా సంస్థలు అమావాస్య రోజు క్రమం తప్పకుండా అన్నదానాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అలకాపూర్ టౌన్‌షిప్‌లో వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, పుప్పాలగూడ నల్లపోచమ్మ దేవాలయం ఆవరణలో ఆదివారం అన్నదానాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో ప్రతి అమావాస్య రోజు అన్నదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో స్థానికులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ బావర్చిలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్ట్ బావర్చి హోటల్‌లో ఆదివారం సాయంత్రం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో పనిచేసే సిబ్బందికి మెడికల్ సర్టిఫికెట్‌లు లేవని గుర్తించారు. హోటల్‌లో అపరిశుభ్రత వాతావరణంతో ఉండడంతో పాటు ఫ్రిజ్‌లో ఉన్న ఆహారంలో నాణ్యత లేనట్లుగా గుర్తించారు. హోటల్ యజమాన్యాన్ని హెచ్చరించడంతో పాటు నోటీసులు జారీ చేశారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం


సమావేశంలో పాల్గొన్న పుట్ట లక్ష్మణ్

రాజేంద్రనగర్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఆదివారం రాజేంద్రనగర్ ఏఆర్ దేవరాజ్ భవన్‌లో పి.శివ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అన్ని మండలాల్లో సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వాలు విద్యా రంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేటర్, ప్రైవేటు పాఠశాలలు విచ్చవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. అనంతరం నూతన కౌన్సిల్ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పవన్, కార్యదర్శిగా వంశీ, ఉపాధ్యక్షుడిగా అరుణ్, పి.వినోద్, బి.వినోద్, సహాయ కార్యదర్శులుగా శివ, భవానీ, శ్రీకాంత్, తేజ, కార్యవర్గ సభ్యులుగా ఆకాశ్, సాయి, ఉపేందర్, నితేష్, కౌన్సిల్ సభ్యులుగా విజయ్, మణికంఠ, బన్నీ, రాహుల్, శివమణి, వంశీ, మేఘన, శివ ఎన్నికయ్యారు. నూతన కమిటీ జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేస్తుందని,విద్యార్థి సమస్యలపై ఉద్యమాలు చేస్తారని రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి కుమార్ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్:మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల వారీగా ఆదివారం ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయనిధి బాధితులకు అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరి అందేలా స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తం 15 మంది లబ్ధిదారులకు రూ. 12.50 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు, జహంగీర్‌ఖాన్, అశోక్, వై. కుమార్, నాయకులు మురళి యాదవ్, ప్రవీణ్‌గౌడ్, కొనమొల్ల శ్రీనివాస్, సురేష్‌గౌడ్, జ్ఞానేశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ కమిటీ

మణికొండ: చిత్రపురి హౌసింగ్ సొసైటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–2023, 2023–2024 సంవత్సరాల వార్షిక బడ్జెట్, ఆడిట్ రిపోర్టులను చదివి వినిపించారు. సొసైటీలో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, అందుకు రూ. 150 కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. ప్రస్తుతం నెలవారి జీతాలు ఇచ్చేందుకే ఇబ్బంది పడుతున్నామని, అందరం కలిసికట్టుగా ఉంటే సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చన్నారు. చిత్రపురిలో మిగిలిన పనులను పూర్తి చేసేందుకు కమిటీ కృషి చేస్తుందన్నారు. కమిటీతో బేదాభిప్రాయాలు ఉన్న కొందరితో వేలాది మంది సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారు గ్రీవెన్స్ కమిటీ, ఆడిటర్‌లతో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. త్వరలో నాలుగు ఎకరాలలో ట్విన్ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని, అందులో 400 ఫ్లాట్ల వరకు వస్తాయని, వాటిని పూర్తిగా సినీ కార్మికులకే కేటాయిస్తామన్నారు. సొసైటీపై వేసిన ఎక్వైరీ 51 కమిటీ ఇచ్చిన నివేదిక తప్పు అని కొత్తగా 60 కమిటీ వేశారన్నారు. సొసైటీపై వేసిన కోర్టు కేసులను ఉపసంహరించుకుని అందరూ ప్రశాంతంగా జీవించేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ దొర, ఉపాధ్యక్షుడు వి. ప్రవీణ్‌కుమార్ యాదవ్, కోశాధికారి టి.లలిత, జిల్లా కోఆపరేటీవ్ సహాయ రిజిస్ట్రార్ మాధవరెడ్డి, నిర్మాత సి. కల్యాణ్, నటుడు పరుచూరి వెంకటేశ్వర్‌రావులతో సొసైటీ పాలకకమిటీ సభ్యులతో పాటు సర్వసభ్య సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్


హాజరైన సభ్యులు